క్లుప్తంగా

నేడు మూడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

బల్లికురవ: మండలంలోని మల్లాయపాలెం, సోమవరప్పాడు, కొప్పరపాలెం గ్రామాల్లో సోమవారం అద్దంకి వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి, ఎన్నికల ప్రచారం చేపట్టనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ ముద్దపాటి శంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 గంటలకు మల్లాయపాలెం, సాయంత్రం 5.30 గంటలకు సోమవరప్పాడు రాత్రి 7 గంటలకు కొప్పరపాలెం గ్రామాల్లో జరిగే ఈ ప్రచారం కార్యాక్రమాల్లో మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు గ్రామస్థాయి నేతలు పాల్గొని జయప్రదం చేయాలని శంకర్ కోరారు.

ఎన్నికల ఫిర్యాదు కాల్ సెంటర్

పర్చూరు (చినగంజాం): పర్చూరులో ఎన్నికల ఫిర్యాదు కాల్ సెంటర్‌ను ప్రారంభిచినట్లు పర్చూరు రిటర్నింగ్ అధికారి, బాపట్ల ఆర్డీవో జీ రవీందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా ఎక్కడైనా కాని అభ్యంతరకరమైన విషయాలను ప్రజలు వివిధ తరగతులు వారు రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకొని రావాల్సిందిగా ఆయన సూచించారు. 85942 43268 నంబర్‌ను కేటాయించామని ఎన్నికలకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులైనా ఆ నంబర్‌కు తెలపాలని ఆయన కోరారు.

సుబాబుల్ తోట దగ్ధం

బల్లికురవ: రహదారి వెంట వెళ్లే గుర్తు తెలియని వ్యక్తులు కాల్చిన సిగరెట్ విసరటంతో మంటలు చెలరేగి మూడెకరాల్లో సుబాబుల్‌తోట అగ్నికి ఆహుతైంది. ఈఘటన ఆదివారం మండలంలోని చెన్నుపల్లి, వైదన లింకు రోడ్డులోని ముక్తేశ్వరం గ్రామ సమీపంలో జరిగింది. అందిన సమాచారం ప్రకారం ముక్తేశ్వరం గ్రామానికి చెందిన నాగిశెట్టి నరసమ్మ మూడెకారాల్లో సుబాబుల్ తోట సాగు చేపట్టారు. తోట ఏపుగా పెరిగి కొట్టుడుకు సిద్ధమైంది. రహదారి వెంట వెళ్లే వ్యక్తులు సిగరెట్ విసరటం, ఎండల తాకిడికి మంటలు చెలరేగాయి. మండలను అదుపులోకి తెచ్చేందుకు స్థానికులు అద్దంకి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. ఫైర్ అధికారి ఆంజనేయులు సిబ్బందితో గ్రామానికి వచ్చి మంటలు పరిసర పోలాలు గ్రామంలోకి వ్యాప్తి చెందకుండా మంటలను అదుపులోకి తెచ్చారు. సుమారు రూ.1.5 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు.

కేంద్ర బలగాల కవాతు

చీరాల: జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఆదివారం చీరాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పారా మిలటరీ బలగాలతో రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది కవాతు నిర్వహించారు. రూరల్ గ్రామాలైన పిట్టువారిపాలెం, గవినివారిపాలెం, దేవినూతల గ్రామాలలో కవాతు నిర్వహించారు. జరగనున్న ఎన్నికల నేపథ్యంలో శాంతి,భద్రతలకు విఘాతం కలిగించిన వారిపై, అసాంఘిక కార్యక్రమాలు, ఎన్నికలకు విఘాతం కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ అన్నారు.

ఏసుక్రీస్తు పునరుత్థానమే ఈస్టర్


కారంచేడులో ప్రత్యేక అలంకరణలో మేరీమాత విగ్రహం


వేటపాలెంలో ఈస్టర్ ప్రార్థనల్లో పాల్గొన్న అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్


చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న పర్చూరు అభ్యర్థి బాలాజీ


మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న నరసింహారెడ్డి

- ఘనంగా ఈస్టర్ పండుగ
- కిక్కిరిసిన చర్చిలు
- సందడి చేసిన చిన్నారులు, యువత

కారంచేడు/చినగంజాం: ఏసుక్రీస్తు ఈలోకంలో మానవ రూపంలో జన్మించి పాపుల కోసం శిలువలో మరణించి, సమాధి చేయబడి మూడో దినాన తిరిగి లేచుటనే క్రైస్తవులు ఈస్టర్ పండుగగా జరుపుకుంటామని లూర్ధుమాత చర్చి విచారణ గురువు ఫాదర్ విజయ్‌సందీప్‌రెడ్డి అన్నారు. గత 40 దినాలుగా క్రైస్తవులు ఉపవాస ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. గత శుక్రవారం రోజున గుడ్‌ఫ్రైడేగా క్రీస్తు పాపుల కోసం శిలువ మరణాన్ని పొందారన్నారు. మూడో దినమైన ఆదివారం వేకువజామునే ఆయన తన సమాధి నుంచి తిరిగి లేచినట్లు బైబిల్ ద్వారా మన గ్రహించగలమన్నారు. ఆయన ఏసుక్రీస్తు ఈలోకంలో జన్మించి తిరిగి లేచిన సన్నివేశాలను వివరించారు. అనంతరం దివ్య బలిపూజను నిర్వహించారు. కార్యక్రమంలో ఫాదర్‌లు, సిస్టర్లు, సంఘ పెద్దలు, క్రైస్తవులు పాల్గొన్నారు. మండలంలోని స్వర్ణ, కుంకలమర్రు, ఆదిపూడి, దగ్గుబాడు, జరుబులవారిపాలెం, కొడవలివారిపాలెం, నందిగుంటపాలెం, కేశవరప్పాడు గ్రామాల్లోను ఈస్టర్ పర్వదిన ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

మానవాళి పాపములను కడిగి వేసేందుకు ఏసుక్రీస్తు ప్రభువు తాను మరణించి పాపప్రాయశ్చిత్తం జరిగించి తిరిగి లేచిన రోజును ఈస్టర్ పండుగ అంటారని బ్రదర్ మేకల మేషక్ బాబు అన్నారు. ఈస్టర్ పండుగ సందర్భంగా చినగంజాం అంబేడ్కర్ నగర్‌లోని పెద్ద చర్చివద్ద ఆదివారం తెల్లవారు జామున ఏర్పాటు చేసిన ప్రార్థన సమావేశంలో ఆయన దైవ వర్తమానాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం సభ్యులు మేడికొండ ప్రేమ్‌కుమార్, ప్రభుకుమార్,అల్లాడి నవీన్,రైల్వే ఉద్యోగి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

లోకరక్షకుడు ఏసుక్రీస్తు..

అద్దంకి రూరల్/బల్లికురవ: సర్వమానావాళి సంక్షేమం కోసం ఏసుక్రీస్తు ఈస్టర్ పర్వదినం సందర్భంగా తిరిగి జన్మించాడని వల్లాపల్లి, బల్లికురవ చర్చి పాస్టర్ అంజయ్య బండారు సురేష్ అన్నారు. ఈస్టర్ సందర్భంగా ఆదివారం మండలంలో చర్చిలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేసి ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. రాత్రినికి ఆయా గ్రామాలకు సమీపంలో ఉన్న కొండ వద్ద ఉన్న ఏసు క్రీస్తు శిలువ వద్ద జరిగిన ప్రార్థనలో అధిక సంఖ్యలో క్రిస్టియన్లు పాల్గొన్నారు. బల్లికురవ, వల్లాపల్లి, కొణిదెన, కొప్పరపాలెం, ఉప్పుమాగులూరు, కూకట్లపల్లి, కొప్పరపాడు, వెలమవారిపాలెం, వైదన, చవిటిమాదిగపల్లె, నక్కబొక్కలపాడు గ్రామాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు.

అద్దంకిలో స్థానిక భిక్షాలు కాలనీలోని చర్చిలో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు వైఎస్సార్ సీపీ నాయకుడు పానెం నరసింహారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పాస్టర్ ఇటికాల యోహాను ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మజ్జిగ అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు కాకాని రాధకృష్ణమూర్తి, నర్రావుల కొండలు, 6వ వార్డు ఇన్‌చార్జి జ్యోతి లవణ్య, భాస్కర్, జడ విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థనలకు హాజరైన అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్..

చీరాల రూరల్: చీరాలలో ఎంతో భక్తి శ్రద్ధలతో ఈస్టర్ పండుగను క్రైస్తవ విశ్వాసులు జరుపుకున్నారు. ప్రభువైన యేసుక్రీస్తు చనిపోయి మూడో రోజు అనగా ఆదివారం తిరిగి సజీవుడుగా లేస్తాడని క్రైస్తవులు ప్రగాఢ విశ్వాసం. అదే విశ్వాసంతో చనిపోయిన తమ పితరులను కూడా తిరిగి యేసుక్రీస్తు లేపుతాడనే అచంచల విశ్వాసంతో క్రైస్తవులు ఈస్టర్ పండుగను ఎంతో ఘనంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి పట్టణంలోని అన్ని క్రైస్తవ శ్మశాన వాటికలలలోని తమ పితరులను స్మరించుకున్నారు. ఆయా సమాధులను పూలతో ఎంతో సుందరంగా అలంకరించారు. సమాధులకు రంగులు వేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని అన్ని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చిలో రెవరెండ్ కొమ్మిన జోసఫ్ కేరి, రెవరెండ్ పిల్లి దేవదాసులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కొరియా దేశం నుంచి వచ్చిన కిమ్ దేవుని వాక్య సందేశాలు అందించారు. వైఎస్సార్ సీపీ చీరాల ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్ చర్చిలో జరిగే ప్రార్థనా కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగ పర్వదినాలలో ప్రతి ఒక్కరూ క్రీస్తును తలచుకుంటూ సుఖ సంతోషాలతో గడపాలని ఆయన తన సందేశంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, కౌన్సిలర్లు మల్లెల లలితా రాజశేఖర్, యాతం మేరిబాబు, గరికపాటి సుధీర్, వాసిమళ్ల వాసు, శ్రీను, యాతం క్రాంతి, చర్చి చైర్మన్ దేటా అశోక్ కుమార్, చర్చి ట్రెజరర్ పేర్లి ఆనంద్, సంఘస్తులు పాల్గొన్నారు.


చినగంజాంలో సమాధి తోటలో సమాధులను అలంకరించి ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

వేటపాలెం: స్థానిక కల్వరి సియోను ప్రార్థన మందిరంలో ఈస్టర్ పండుగ సందర్భంగా చీరాల వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో చీరాల మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, బండి కళ్ల నరేష్, నలమల దావీదు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మార్పు బాయేసు, మకెన దాసు, ఉమ్మిడి శివ, వాసిమల్ల వాసు పాల్గొన్నారు.

జనుల పాప క్షమాపణ కోసం ప్రాణాలర్పించిన మహోన్నతుడు

పర్చూరు (చినగంజాం): జనుల పాప క్షమాపణ కోసం తన ప్రాణాలను సైతం అర్పించిన మహోన్నతుడు ఏసుక్రీస్తు ప్రభువు అని పర్చూరు అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ అన్నారు. ఈస్టర్ పండుగను పురస్కరించుకొని పర్చూరు అంబేడ్కర్ నగర్, నూతలపాడు చర్చిల్లో ఆయన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముందుగా ఆయన ఫాస్టర్ నిర్వహించిన ప్రార్థనలో పాల్గొని ఆయన ఆశీర్వచనాలు తీసుకున్నారు. అనంతరం ఆయన క్రైస్తవ సోదరులనుద్దేశించి మాట్లాడుతూ క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరు అనుసరించాలన్నారు. కార్యక్రమంలో ఆయనతో పాటు అంబేడ్కర్ నగర్ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


కారంచేడులో ఈస్టర్ ప్రార్థనల్లో పాల్గొన్న చర్చి ఫాదర్లు


వల్లాపల్లి కొండపై ఉన్న చర్చి వద్ద విద్యుత్ దీపాలతో అలంకరణ

జగనన్న సంక్షేమ రాజ్యం కోసం పనిచేయాలి

- పర్చూరు అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ

చినగంజాం: జగనన్న సంక్షేమ రాజ్యాన్ని రాష్ట్రంలో తిరిగి తెచ్చుకోవాలంటే అందరూ కలసి కట్టుగా పని చేయాలని పర్చూరు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో తనను కలిసేందుకు వచ్చిన పలువురు పార్టీ కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలోని ప్రజలు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందించిన పారదర్శకమైన పరిపాలనను చూశారన్నారు. గత ప్రభుత్వాలు చేపట్టిన ఎన్నో బృహత్తర పథకాలు ఆయన చేపట్టి అమలు చేసి చూపారన్నారు. అందరూ ఐకమత్యంగా ఉండి విభేదాలు విడనాడి ఎన్నికల వేళ అభ్యర్థుల గెలుపు కోసమే కృషి చేయాలన్నారు. ఇందులో భాగంగా ఆయనను చినగంజాం మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని మోటుపల్లి పంచాయతీ పరిధిలోని టీడీపీ నాయకులు రామాని సోమరాజు, నాయుడు వెంకటేశ్వర్లు తదితరులు వైఎస్సార్ సీపీలో చేరడంతో వారికి బాలాజీ శాలువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆసోది శ్రీనివాసరెడ్డి, రాజు శ్రీనివాసరెడ్డి, హేమంత్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మోటుపల్లి నాయికులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బాలాజీ

మానవత్వం చాటుకున్న వెంకటేష్


గాయపడిన మహిళలను పరామర్శిస్తున్న వెంకటేష్

చీరాల: ద్విచక్రవాహనంపై వెళుతున్న మహిళ చున్నీ వాహనం చక్రంలో చిక్కుకొని అదుపు తప్పి కిందపడడంతో గాయాలయ్యాయి. ఆదివారం రైల్వే ఓవర్ బ్రిడ్జిపై ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అదే సమయంలో అటుగా వెళుతున్న వైఎస్సార్ సీపీ చీరాల ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్ ఘటనను చూసి వెంటనే స్పందించారు. ఆమెను పరామర్శించి 108 అంబులెన్స్‌ను పిలిపించి చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. గాయాలైన మహిళకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. మానవతా దృక్పథంతో స్పందించిన ఆయన సత్వర వైద్యసేవలందేలా చేశారు. ద్విచక్రవాహనంపై ప్రయాణించే మహిళలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

20 ఏళ్లుగా విద్యార్థుల సేవలో..

- నేటి నుంచి ఉచిత కోచింగ్ శిక్షణ తరగతులు
- ఇంజినీరింగ్, మెడిసిన్, పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షల కోసం ఉచిత శిక్షణ


దూర ప్రాంతాల నుంచి హాజరయ్యే విద్యార్థుల వసతి కోసం రూపుదిద్దుకుంటున్న నిర్మాణం

చీరాల రూరల్: 20 ఏళ్లకుపైగా విద్యార్థులకు అన్నీ తానై ఇంజినీరింగ్, మెడిసిన్, పాలిటెక్నిక్, ఈసెట్ వంటిపై ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తూ వారికి కావాల్సిన స్టడీ మెటీరియల్స్, వారికి ఉచిత భోజనం, వసతి కల్పిస్తు తన దాతృత్వం చాటుకుంటున్నారు. ఆయా శిక్షణలో మంచి ప్రావీణ్యం కలిగిన వారికి ఉద్యోగ నియామకాలు కల్పిస్తు ఉచితంగా సేవలు అందిస్తున్నారు అవ్వారు ముసలయ్య. వీవర్స్ ఎడ్యుకేషనల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ (వెసో) అధ్యక్షుడు, రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు అవ్వారు ముసలయ్య. ప్రకాశం, బాపట్ల జిల్లాలలోని అన్ని గురుకుల పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, మున్సిపల్ పాఠశాలలు, ఏపీ మోడల్ స్కూళ్లు, కస్తూరిబా గాంధీ విద్యాలయాలలో పదో తరగతిలో విద్యనభ్యసిస్తున్న పరీక్షలు రాస్తున్న నిరుపేద విద్యార్థిని, విద్యార్థులకు ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఇంజినీరింగ్, మెడిసిన్, పాలిటెక్నిక్ వంటి ప్రవేశ పరీక్షలకు ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. శిక్షణా తరగతులకు హాజరయ్యే విద్యార్థిని, విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించారు. ఇప్పటికే రెండు జిల్లాలలోని చీరాల, అమ్మనబ్రోలు, పర్చూరు, నాగులపాలెం, అద్దంకి, యద్దనపూడి, చీమకుర్తి, నిజాంపట్నం పాఠశాలలకు చెందిన 3,490 మంది విద్యార్థులను ప్రత్యక్షంగా కలిసి పదో తరగతి పరీక్షల అనంతరం ఏపోటీ పరీక్షలు రాయాలో వివరించి వారిని శిక్షణా తరగతుల కోసం సన్నద్ధం చేస్తున్నారు అవ్వారు ముసలయ్య.


20 ఏళ్ల క్రితమే స్థాపన..

20 ఏళ్ల క్రితం వీవర్స్ ఎడ్యుకేషనల్ సొసైటిని చీరాల తెల్లగాంధీ బొమ్మ ఎదురు వీధిలో స్థాపించి అక్కడే నివాసముంటున్న అవ్వారు ముసలయ్య వైఎస్సార్ సీపీలో సీనియర్ నాయకుడిగా క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ఇప్పటికే రెండు పర్యాయాలు ఆయన, ఆయనతో పాటు ఆయన సతీమణి రెండు, రెండుసార్లు మున్సిపల్ కౌన్సిలర్లుగా ఎన్నికై ప్రజలకు సేవలందించారు. సీఎం వైఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశానుసారం రాష్ట్ర బీసీ కమిషనల్ సభ్యుడిగా విధులు నిర్వర్తించారు.

ప్రతి ఏడాది 300 మందికి శిక్షణ..

ప్రతి ఏడాది ఇంజినీరింగ్, మెడిసిన్, పాలిటెక్నిక్ వంటి కోర్సులకు మంచి నిష్ణాతులైన ఫ్యాకల్టీలతో ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. సుధూర ప్రాంతాల నుంచి శిక్షణ తరగతులకు హాజరయ్యే విద్యార్థిని, విద్యార్థులకు ఉచిత భోజన సదుపాయంతో పాటు వసతి కల్పిస్తున్నారు. ఈ రెండు నెలల కాలంలోనే ఆయన తన సొంత నిధులు రూ. 1 లక్ష పైగా ఖర్చు చేస్తున్నారంటే విద్యార్థులపై ఆయనకున్న మక్కువను ఇట్టే అర్థం చేసుకోవచ్చు. అంతేకాక ఆయన వద్ద శిక్షణ పొందిన 1,000 విద్యార్థులను వివిధ కంపెనీలలో ఉద్యోగ నియామకాలు అందజేశారు. వారిలో ఆల్ ఇండియా స్థాయిలో ఇండియన్ ఇంజినీరింగ్ సరీ్వసులో (ఏఈఎస్) మొదటి ర్యాంక్ సాధించాడు. ప్రస్తుతం అతడు రైల్వేలో ఉన్నత స్థాయి ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. బాపట్ల, ప్రకాశం జిల్లాలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరుతున్నారు.

> **విద్యార్థుల అభ్యున్నతి కోసమే..**
>
> విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించడం కోసమే ప్రతి ఏడాది లక్షలకు లక్షలు వెచ్చించి ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులకు సేవలందించడం ఎంతో తృప్తిగా ఉంది. శిక్షణ పొందిన 3,000 మంది విద్యార్థులలో 1000 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు వచ్చాయి.


అవ్వారు ముసలయ్య, వెసో అధ్యక్షుడు

నేటి నుంచి యడం బాలాజీ ఎన్నికల శంఖారావం

పర్చూరు (చినగంజాం): నేటి నుంచి అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు మార్టూరు మండలం వలపర్ల గ్రామం నుంచి ఎన్నికల శంఖారావం ప్రారంభిస్తారని ఆ పార్టీ పర్చూరు నాయకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జేసీఎస్ కన్వీనర్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు ప్రతిష్ఠ వేడుకలు

బల్లికురవ: మండలంలోని కొణిదెన గ్రామంలో ఎంతో చరిత్ర కలిగిన బ్రహ్మగుండం వద్ద ఆదిత్యాది నవగ్రహ ప్రతిష్టా 41వ రోజుల వేడుకలు సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఆదివారం తెలిపారు. వేడుకల్లో భాగంగా మహాగణపతి పూజ పుణ్యాహవచనం, గణపతి హోమం, నవగ్రహ హోమం, నవగ్రహాలకు పంచామృతాలతో అభిషేకం, విశేషంగా అలంకరణ, అర్చన, వస్త్ర సమర్పణ, మహాపూర్ణాహుతి, ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాల వితరణ జరుగుతుందన్నారు. పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనాలన్నారు.

సంస్కృత భాష గొప్పదనం ఎనలేనిది

చీరాల అర్బన్: సంస్కృత భాష గొప్పదనం ఎనలేనిదని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం సంస్కృత భారతీ ఆంధ్రప్రదేశ్ క్షీరపురి శాఖ ఆధ్వర్యంలో స్థానిక కొట్లబజారులోని సత్యసాయి మందిరంలో సంస్కృత సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ భారతీయ ప్రాచీన భాషలకి పునర్వైభవం కోసం కృషి చేయాలని సంస్కృతీ భారతి సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు దొప్పలపూడి నిరుపమ, న్యాయవాది రమేష్, ముంగర రాంబాబు, సంస్కృతిక భారతి చీరాల ఇన్‌చార్జి చందలూరి గీత తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

కొణిదెనలో రేపు ఆరోగ్య సురక్ష క్యాంప్

బల్లికురవ: మండలంలోని కొనిదెన గ్రామంలో మంగళవారం ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహిస్తున్నట్లు గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ రమీజ్ అహమ్మద్ ఆదివారం తెలిపారు. మొదటి విడతలో చూపించుకున్న రోగులు కేస్‌షీట్‌లు, రిపోర్టులతో పాటు, కొత్తరోగులు శిబిరానికి హాజరై సద్వినియోగ పరుచుకోవాలని వైద్యాధికారి కోరారు.

ముగిసిన జిల్లాస్థాయి టెన్నిస్ క్రికెట్

చీరాల రూరల్: గత పదిరోజులుగా జాలమ్మగుడి దండుబాట రోడ్డులో శ్రీరాం ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జై శ్రీరాం రెడ్ టెన్నిస్ క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. పోటీలలో ముఖ్య అతిథిగా మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ రాజు వెంకటేశ్వర రెడ్డి పాల్గొని క్రీడా కారులకు నగదు బహుమతులు అందజేశారు. ఈపోటీలలో అన్ని విభాగాలలో రాణించిన జైశ్రీరాం చీరాల జట్టు విజేతగా నిలిచి రూ. 20,116 ప్రైజ్‌మనీని అందుకుంది. రెండోస్థానంలో ఫ్రెండ్స్ ఫర్ ఎవర్ జట్టు నిలిచి రూ. 15,116 నగదు బహుమతిని అందుకుంది. మూడో స్థానంలో పందిళ్లపల్లి జట్టు నిలిచి రూ. 10,116 నగదు బహుమతిని అందుకుంది. అలానే నాలుగో స్థానంలో కనపర్తి క్రికెట్ జట్టు నిలిచి రూ. 5,116 నగదు బహుమతిని అందుకుంది. మాన్ ఆఫ్‌ద మ్యాచ్‌గా జై శ్రీరాం జట్టు క్రీడాకారుడు సమ్మెట శివారెడ్డి నిలవగా, మ్యాన్ ఆఫ్‌ద సిరీస్‌గా పందిళ్లపల్లి జట్టు క్రీడాకారుడు నవీన్ నిలిచాడు. కార్యక్రమంలో పి. ప్రభాకర రెడ్డి, ఎ. చిన్న, యాత్ర శేఖర రెడ్డి, కొణసం పాండురంగా రెడ్డి, వికాస్ రమణ, కప్పల సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద వృద్ధులకు చీరలు పంపిణీ

చీరాల రూరల్: ఈస్టర్ పండుగను పురస్కరించుకుని పద్మ భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఘంటా అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం పేరాలలోని శృంగారపేట, ఆనందపేటలలో 35 మంది నిరుపేద వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ అనిల్‌కుమార్ మాట్లాడారు. మానవాళి సంక్షేమం కోసం ప్రభువైన యేసుక్రీస్తు పునరుజ్జీవం పొందిన పవిత్రమైన ఈస్టర్ పండుగ రోజున వృద్ధులకు చిరుకానుక అందజేయడం తనకు ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో కనపర్తి దానయ్య, వనమా జయకుమార్, బాబురావు,పాస్టర్లు గంగాధర్, జయపాల్‌లు ప్రార్థనలు నిర్వహించారు.

'వరాల గోరుముద్దలు' కావ్యావిష్కరణ

అద్దంకి రూరల్: సృజన ఆధ్వర్యంలో స్థానిక కమతేశ్వరస్వామి దేవస్థానంలో మహిళలు ఆదివారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ప్రముఖ కవయిత్రి యరమంద్ర వరలక్ష్మీ రచించిన ‹వరాల గోరుముద్దలు› కావ్యాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవయిత్రి పాలపర్తి జ్యోతిష్మతి కావ్యాన్ని సంక్షిప్తంగా వివరించారు. ఆబాల గోపాలన్ని అలంరించే విధంగా వరలక్ష్మీ రచించిన వరాల గోరుముద్దలు కావ్యం ఉందన్నారు. రసరమ్యంగా వర్ణించారని రచయితలు మువ్వల కాశీ విశాలక్షి, దాస్యం రాజ్యలక్ష్మీ అన్నారు. న్యాయవాది కుసుమలత కొల్లా భువనేశ్వరీ, చుండూరి కాశీ ప్రసన్న, ఉమా అన్నపూర్ణ రచయిత వరలక్ష్మీని సత్కరించారు. కార్యక్రమంలో గాడేపల్లి దివాకరదత్, వీరవల్లి సుబ్బారావు అన్నమనేని వెంకటరావు, షేక్ మహమ్మద్ రఫీ, అద్దంకి లెవీ ప్రసాద్, శతావధాని నారాయణం బాలసుబ్రమణ్యం, జ్యోతి చంద్రమౌళి, రోటరీ, వాఫీ వనిత క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

చీరాల అర్బన్: రోటరీ క్లబ్ చీరాల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం చీరాల మండలం సాల్మన్‌సెటర్ పంచాయతీలోని పాండురంగ వృద్ధాశ్రమంలో నిత్యావసర సరుకులు, కూరగాయలు, పండ్లు, 50 కేజీల బియ్యం అందించారు. తాటికొండ సంపూర్ణమ్మ జ్ఞాపకార్థం రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ దోగుపర్తి వెంకట సురేష్ ఆర్థిక సహకారంతో ఆశ్రమ నిర్వాహకులు వీబీబీ సత్యనారాయణకు అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు మామిడాల శ్రీనివాసరావు, చీరాల కృష్ణమూర్తి, పోలుదాసు రామకృష్ణ, డివి సురేష్, జివై ప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.